
# సంకల్పం

పి.వి.శేషారత్నం



ఏడేళ్ల శర్వాణి దీక్షగా టీవీలో వస్తున్న డాన్సు కార్యక్రమాన్ని తదేకంగా చూస్తోంది. తను కూడా టీవీలోని పాపలా చేతులు తిప్పేందుకు ప్రయత్నిస్తోంది.

కూతురుకోసం ఇల్లంతా వెతుకుతూ ఇందిర హాల్లోకి వచ్చింది.

'చిట్టితల్లీ... ఇక్కడున్నావా? పొద్దుననగా తాగిన పాలు, ఆకలేయడం లేదా? టీవీ చూడడంలో పడితే... నీకేమీ అక్కర్లేదు కదా'.

పాప తల్లికేసి తలెత్తికూడా చూడలేదు. అది అలవాటయిన విషయంలా ఇందిర కూడా పట్టించు కోలేదు.

'ఏంటీ టీవీ పాపలా డాన్సు చేస్తావా? అలాగేలే... నీకు రేపు మంచి డాన్సు సీడీ తెచ్చి చూపిస్తాను సరేనా? దా, అన్నం తిందువు గాని, ఆ, నోరు తెరు...'

ప్రేమగా శర్వాణికి వెండిగిన్నెలో కలిపి తెచ్చిన అన్నం తినిపిద్దామని ప్రయత్నిస్తోంటే తల తిప్పేసుకుంది శర్వాణి.

'అలా బుర్ర తిప్పేస్తే ఎలా తల్లీ అన్నం తినకపోతే బొజ్జకి ఆకలెయ్యదూ... ఇది అమ్మ ముద్ద... ఇది నాన్న ముద్ద... ఇది మామ్మ ముద్ద...'

అయినా శర్వాణి తినడానికి ఇష్టపడనట్టు అదేపనిగా తల తిప్పడం చూసి ఇందిర మాతృహృదయం కలత చెందింది. పట్టు వదలని విక్రమార్కుడిలా కూతురి ముఖాన్ని తనవైపుకి తిప్పుకుని నవ్వించడానికి ప్రయత్నించింది.

'అలాకాదు చిట్టీ... బువ్వ తినకపోతే నీ బుగ్గలు ముసలమ్మలా ఇలా లొట్టలు పడి పోవూ...' ఇందిర ముసలమ్మలా తన బుగ్గలు లోపలికి లాక్కుని లొట్టలు పడినట్టు నటించి చూపించే సరికి అర్థమైనట్టే శర్వాణి కిలకిలా నవ్వింది.

ఇందిర మనసు ఆర్ద్రమైంది. 'అదీ అలా నవ్వాలి... మరి నన్ను అమ్మా అని ఎప్పుడు పిలుస్తావురా చిట్టీ... పోనీలే... ఇవాళకాకపోతే.. రేపు... నాకు తొందర లేదులే... నువ్వు నా కళ్ల ముందుంటే అంతే చాలు...' ఇందిర బలవంతంగా పాపనోట్లో ముద్దలు పెట్టింది. తర్వాత శర్వాణి మూతిని కొంగుతో తుడిచి పైకి లేచింది.

కొంగులాగిన శర్వాణిని ముద్దు పెట్టుకుని 'ఏమిటీ ఆడుకుందామా? ఇదిగో ఈ గిన్నె లోపల పెట్టేసి ఇప్పుడే వచ్చేస్తాను. నువ్వీలోగా టీవీ చూసుకో... సరేనా?'' అంటూ లోపలికెళ్లింది ఇందిర.

ఇదంతా అక్కడ హాల్లో పేపరు చదువుకుంటున్నట్టు నటిస్తూ ఓరకంట గమనిస్తున్న ఇందిర భర్త సుధాకర్ టీవీ కార్యక్రమంలో మునిగిపోయిన కూతురు శర్వాణి వంక ఓ క్షణం నిరసనగా చూసి మళ్లీ పేపర్లోకి తల దూర్చాడు. 'దీని మొహానికి డాన్సు ఒక్కటే తక్కువ' అన్నట్టు.

టీవీలో డాన్సు షో అయిపోగానే ఆసక్తి పోయింది శర్వాణికి... ఏదో గుర్తొచ్చినట్టు హాల్లోని షోకేస్ వైపు చూసింది శర్వాణి.

అక్కడున్న తన టెడ్డీబేర్ బొమ్మ తీసుకోవడం కోసం ఒక స్టూలు జరుపుకుని దానిమీద కెక్కి ఆ బొమ్మ అందుకోవడానికి ప్రయత్నించడంలో పక్కనే ఉన్న కృష్ణుడి బొమ్మ కిందపడి పగిలి పెద్ద శబ్దం చేసినా శర్వాణికి వినిపించలేదు. తన బొమ్మ తీసుకోవడంలో స్టూలు అంచుకి జరుగుతున్నా ఆ పాప ప్రయత్నం మానలేదు.

బొమ్మ బద్దలయిన శబ్దానికి సుధాకర్ కోపంగా కూతురికేసి చేసి 'ఇందిరా' అని లోప లున్న భార్యను పిలుస్తూ అరిచాడు.

ఇందిర లోపల్నుంచి పరిగెత్తుకొచ్చి స్టూలు మీంచి పడిపోబోతున్న పాపను గభాలున పట్టు కుంది.

సుధాకర్ కోపం పట్టలేక భార్య చేతుల్లోంచి శర్వాణిని లాగి వీపు మీద దబాదబా నాలుగు దెబ్బలు వేసాడు.

ఇందిర పాపను లాక్కుని గుండెకి హత్తుకుని గ్రుడ్ల నీరు కుక్కుకుంది. 'అయ్యయ్యో అది నోరు లేని పసి పిల్లండీ...'

'అయితే మాత్రం ఖరీదైన దేవుడి బొమ్మను పగల గొడుతుందా?' సుధాకర్ కళ్లల్లో అంతులేని ఆగ్రహం.

'పసివాళ్లు కూడా దేవుడితో సమానమేగా...'

సుధాకర్‌కి తిక్కరేగింది.

'అయితే దాన్ని దేవుడి గూట్లో కూర్చోబెట్టి పూజించుకో... ఓ మాటా పలుకూలేని దీని దేభ్యం మూగి మొహం చూడాలంటేనే రోత కలుగు తోంది'.

కూతురిని మూగి అనేసరికి ఇందిర కూడా కోపంగా ఎదురు తిరిగింది.

'అసలు మీరు కన్న తండ్రేనా?' సుధాకర్ తగ్గాడు.

'ఇందిరా... సూటిగా చెబితే నీకర్థం కాదా? ఇది మాట్లాడదు. మనం మాట్లాడితే వినబడి చావదు... ఏదన్నా శరణాలయంలో పడేస్తే మనకి ఈ అవస్థ తప్పుతుంది'.

ఇందిర ఆవేశంగా రెచ్చిపోయింది. 'మనకి అనకండి... మీకు అనండి..'

సుధాకర్ కూడా కోపంగా 'ఈ నికృష్టపు మూగి మొహాన్ని చూడలేక మా అమ్మ మా అక్క దగ్గరకి వెళ్లిపోయింది. నేనూ ఏదో ఒక రోజు సన్యా సుల్లో కలిసిపోతానులే'.

ఇందిర కంఠంలో వెటకారం తొణికిసలా డింది. 'అది మీకు సరిపోదులెండి. సన్యాసులకు బాగా సహనం ఉండాలి' సుధాకర్ చిటపట లాడుతూ బయటికి వెళ్ళిపోయాడు.

'హు.... మాటకు మాట ... ఛ... ఈ ఇంట్లో నాకు విలువ లేకుండా పోయింది. ఇదంతా ఈ మూగ దెయ్యం మూలానే'.

ఇందిర హృదయంలో దుఃఖం బద్దలైంది. కూతురిని గుండెకి హత్తుకుంటూ ఏడ్చింది.

'చూడమ్మా చిట్టీ... మీ నాన్న ఎంతలేసి మాట లన్నారో... ఎవరు నిన్ను కాదనుకున్నా నేను మాత్రం నా గుండెల్లో దాచుకుంటాను సరేనా?'

ఏడేళ్లుగా భర్తతో అత్తగారితో రోజూ ఇదే తగవు.

ఏమనుకుందో ఏడుస్తున్న తల్లిని చూసి తను ఏడుపు ఆపి తల్లి కన్నీళ్లు తన చిన్ని అరచేతులతో తుడుస్తున్న కూతురిని చూసి మరింత ఏడ్చింది ఇందిర.

***

కూతురిని నడిపించుకుంటూ తీసుకొచ్చి పార్కులో ఓ చోట పదిలంగా కూర్చోబెట్టింది ఇందిర.

'చిట్టీ... ఇదిగో ఈ పక్కనే ఉన్న షాపుకెళ్లి నీకు చాక్లెట్లు, బిస్కెట్లు... కొనుక్కొస్తాను. నువ్వేమో ఎంచక్కా ఈ బెంచ్‌మీద కూర్చుని ఆ గాలి పటాలె గరేస్తున్న ఈ పిల్లలని చూస్తుండు. సరేనా?'

తల్లి మాటలకి మూగగా కళ్లప్పగించి చూస్తుంది తప్ప మాట్లాడ లేదు శర్వాణి.

తన పంచప్రాణాలు అక్కడే ఉంచినట్టుగా ఇందిర వెనక్కి చూస్తూనే బయటికి వెళ్లింది.

ఇందిర వెళ్లిపోగానే పిల్లలు చుట్టుముట్టారు శర్వాణిని. పదేళ్ల ఓ కుర్రాడు శర్వాణి చెయ్యి పట్టు కునేందుకు ప్రయత్నించాడు.

'ఇదిగో... నీ పేరేంటి? నువ్వూ మాతో ఆడుకుంటావా? నాతో రా... నీకు గాలిపటం ఇస్తాను'. అంటూ చెయ్యి పట్టుకుని తీసికెళ్లాడు.

శర్వాణికి ఆ కుర్రాడి మాటలు వినిపించక పోయినా ఆ పసిము ఖంలో ఆనందం కదలా డింది.

ఇంకోపిల్ల చకచకా వచ్చి ఆ కుర్రాడి చేతిని విడదీసి శర్వాణి చేతి లోని గాలిపటం లాక్కుంది.

'చందూ దీన్నెం దుకు తీసుకొచ్చావురా... ఇది మూగది. దీనికే ఆటలూ రావు. మా ఇంటిపక్కనే వీళ్ల ఇల్లు...'

చందూకి మాత్రం జాలేసింది. 'పోనీలే బుజ్జీ... మనమే ఆడిద్దాం...'

ఆ పిల్ల ఒప్పుకో లేదు. 'వద్దురా... ఇది వట్టి మొద్దు... దీనికి వినబడదు కూడా...'

'ఓహో అందుకేనా అలా గుడ్లప్పగించి చూస్తోంది....' తన మాటలకి సమాధానం చెప్పని శర్వాణిని చూసి చందుకీ విసుగొచ్చింది.

శర్వాణి గాలిపటం కావాలన్నట్టు ఇవ్వమ న్నట్టు సైగలు చేస్తుంటే పకపకా నవ్వింది బుజ్జి అనే ఆ పిల్ల.

'ఏ.... ఏ... నీకు గాలిపటం ఎందుకే మూగీ... పో అవతలకి'.

శర్వాణికి ఆ పిల్ల ఏమంటున్నదీ అర్థం కాక పోయినా గాలిపటం ఇవ్వనందుకే ఏడుపు మొహం పెట్టింది.

చివరకి ఎవరూ తనను ఆడనివ్వకపోవడంతో పార్కు మధ్యలో పెట్టిన విగ్రహం భంగిమను పరి శీలించడంలో మునిగిపోయింది.

అప్పుడే అక్కడకు వచ్చి అక్కడే సిమెంటు బల్ల మీద కూర్చున్న ఒక ముసలాయన ఆ బొమ్మను, దానిని అనుకరించే ప్రయత్నంలో చేతులు సరిచూ సుకుంటూ నిమగ్నమైన శర్వాణిని గమనించిన ఆయన ముఖంలో చిత్రమైన చిరునవ్వు... దీక్షగా చూస్తుండిపోయాడు.

ఓ అరగంట గడిచాక ఇందిర పక్కనే ఉన్న షాపులో తనకి కావలసిన వస్తువులు కొనుక్కొచ్చి కూతురి కోసం వెతుక్కుంది.

WORLD CLASS TREATMENT

డా॥ రాయ్
Estd : 1950
గుప్తరోగములన్నింటికి శాస్త్రీయమైన పద్ధతితో అసమానమైన చికిత్స, సుఖమయమైన దాంపత్య జీవితం, కొత్త యవ్వనం కొరకు సంప్రదించండి
శీఘ్రస్ఖలనము సంతానం లేని వారు మరియు అంగము చిన్నదైనచో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆధునిక పరికరముల ద్వారా చికిత్స చేయబడును.
డా॥ రాయ్స్ క్లినిక్
సెంట్ మేరీస్ రోడ్, మనోహర్ టాకీస్ ప్రక్కన, సికింద్రాబాద్.
Ph: 27807796, 27717839
OLDEST CLINIC WITH LATEST TECHNOLOGY

'ఇక్కడున్నావా చిట్టీ... నీతో ఎవరూ ఆడలేదా... పోనీలే... నేను ఆడతాగా.. ఆ .. ఇదిగో నీ చాక్లెట్టు... నా బంగారు తల్లి' పేచీ పెట్టకుండా బుద్ధిగా కూర్చున్న కూతురిని చూసి ఆ మాతృహృదయం పొంగిపోయింది.

తల్లీకూతుళ్లను అదేపనిగా గమనించిన ముసలాయన నోరువిప్పాడు.

'పాపా... ఇలారావ్మూ. నీ పేరేంటి?' పిలిచాడు శర్వాణిని. శర్వాణి తలెత్తలేదు. ఆయనకేసి చూడలేదు.

ఇందిర నొచ్చుకుంటున్నట్టు 'సమాధానం చెప్పలేదని ఏమీ అనుకోకండి. మా శర్వాణికి మాటలు రావండీ... చెముడు కూడా...' అంది

'మీరేం బాధ పడకండి. ఇలాంటి వాళ్లకే భగవంతుడు కళల్లో మంచి ప్రవేశం కలిగిస్తాడు'.

తర్వాత అడక్కుండానే తన వివరాలు చెబుతూ 'నా పేరు భార్గవ శర్మ... కొడుకులు అమెరికాలో... భార్య ఈ మధ్యే కాలం చేసింది.

ఇప్పటికీ ఆసక్తితో వచ్చిన ఒకరిద్దరు పిల్లలకు డాన్సు పాఠాలు చెబుతుంటాను. అయినా ఈ కాలంలో శాస్త్రీయ కళల పట్ల అభిరుచి ఎవరికుంది? ఈ పక్క వీధిలోనే మా ఇల్లు... మీ కభ్యంతరం లేకపోతే ఖాళీగా ఉన్నప్పుడు ఎప్పుడైనా మీ పాపను నా దగ్గరికి తీసుకువచ్చి వదిలెయ్యండి. నాకూ కాలక్షేపం.' అన్నాడు దీర్ఘంగా ఆలోచిస్తూ.

'భగవంతుడు ఒక్కొక్కళ్లకి ఒక్కో లోటు పెడతాడు కాబోలు. 'రెక్కలొచ్చిన బిడ్డలు అమెరికా ఎగిరి పోతే ఒంటరిగా బ్రతుకీడుస్తున్న ఆ వృద్ధుడిని చూసి ఇందిర గాఢంగా నిట్టూర్చి కూతుర్ని తీసుకొని బయల్దేరింది. 'అలాగే.. చాలా పొద్దుపోయింది... వస్తామండి'.

***

బాబ్డ్‌హెయిర్... చూడ చక్కని రూపం... ఆధునిక అలంకరణ... ఆ అమ్మాయి చాలాసేపు స్నేహితురాలు ఇందిర ఇంటికోసం వెతుక్కుంటూ తిరుగుతోందేమో చివరకి ఆ ఇంటిముందు నేమ్‌ప్లేట్ మీద ఇందిర భర్త సుధాకర్ పేరు చూసి తేలికగా నిట్టూర్చింది.

'ఐ... సుధాకర్... ఆ ... ఇది మా ఇందిర ఇల్లే... ఇందూ! ఇంట్లో ఉందో లేక కూతురుతో షికార్లు కొడుతోందో? అబ్బ ఈ పాప బంగారుబొమ్మలా ఎంత బావుందో? ఇలా రావ్మూ పాపా. నువ్వు మా ఇందూ కూతురువే కదూ! నా పేరు నిర్మల. మీ అమ్మకి ప్రాణస్నేహితురాలిని. నువ్వు పుట్టినప్పుడు ఫారిన్‌లో ఉండడం వల్ల రాలేకపోయాను. అది సరే గాని... నీ పేరేంటి?'

గలగలా మాట్లాడుతున్న ఆ యువతిని చూసి కూడా అక్కడే ఆడుకుంటున్న శర్వాణి ఏం మాట్లాడ లేదు.

కూతురికి బోర్నవిటా కలుపుకుని వచ్చిన ఇందిర స్నేహితురాలు నిర్మలని చూసి సంతోషం పట్టలేక పోయింది.

''ఏంటే నిర్మలా అప్పుడే మా శర్వాణితో కబుర్లు చెప్పేస్తున్నావా? పూర్తిగా ఇండియా వచ్చేసి నట్టేనా? ఇదేనా రావడం? ఇన్నాళ్లకి జ్ఞాపకం వచ్చానన్నమాట'.

'అప్పుడే నిష్టూరం మొదలెట్టావా తల్లీ... అయితే నీ జట్టు పచ్చి.... అన్నట్టు నీ కూతురు అచ్చం నీ నోట్లోంచి ఊడిపడ్డట్టుందే... అందాల భరిణె'.

'ఊ... అప్పుడే మొదలెట్టావు భట్రాజు పొగడ్తలు..' ఇందిర సన్నగా నవ్వింది నిర్మల బుగ్గలు సాగదీస్తూ.

'పోన్లేవే... నీ కూతురికి దిష్టి తగలకుండా ఓ కేజీ జీడిపప్పు దిష్టి తీసి నేతిలో వేయించి ఇచ్చెయ్... హాయిగా తినేస్తాను'

'దేశాలు తిరిగొచ్చినా నువ్వూ నీ మాటలు ఏం మారలేదే!'

'ఏంచేస్తాం పుట్టకతో వచ్చిన బుద్ధాయె. నువ్వు మాత్రం కూతురి సేవలో పడి బాగా మారిపోయావే. అది సరే గాని మీ శ్రీవారు ఎక్కడా కనిపించరేం?' చుట్టూ చూసింది నిర్మల.

ఇందిర గాఢంగా నిట్టూర్చింది.

'ఆయనకి ఇంటికంటే ఆఫీసే పదిలం... ఆ ... అంతదూరం ప్రయాణం చేసి వచ్చావు. స్నానం చేసి త్వరగా వస్తే వేడివేడిగా పెసరట్లు వేస్తాను'.

'చిన్నప్పటిలా వీపుమీద కాదు కదా!'

'పోవే నీ కొంటె మాటలూ నువ్వూనూ' ఇందిర మనోహరంగా నవ్వింది.

'అబ్బ ఇలా నీ అందమైన నవ్వు చూసి ఎన్నాళ్లయిందోనే ఇందూ?'

'నేనూ మనసారా నవ్వి చాలానాళ్లయిందిలే' మనసులోనే భారంగా నిట్టూర్చింది ఇందిర.


''టిఫిన్‌కి ఏం కంగారు లేదులే... తాపీగా చెయ్యి... నేనీలోగా ఈ బంగారు తల్లితో కబుర్లు చెప్పుకుంటాను'.

'అలాకాదు. వంటింట్లో నాతో మీ ఆయన కబుర్లు చెప్పుదువుగాని రా.' నిర్మలను లోపలికి లాక్కు వెళ్లింది.

***

రెండో రోజు ఉండబట్టలేక ఇందిర భుజం మీద చెయ్యేసి అడిగేసింది నిర్మల.

'ఇందూ! నిన్నోమాట అడుగుతాను దాచవు



## ఎట్టకేలకు యజమానిని చేరిన పిల్లి....

విశ్వాసానికి మారు పేరుగా కుక్కను చెప్పుకుంటాం. ఎక్కడికి వెళ్లినా, ఎన్ని రోజులకయినా యజమాని దగ్గరకు వచ్చే గుణం కుక్కది. ఆ కుక్కకు ఏమాత్రం తీసిపోనని నిరూపించింది ఇంగ్లాండ్‌కి చెందిన ఓ పిల్లి. మూడు వందల మైళ్లు తిరిగి, మూడు వారాల తరువాత తన యజమానిని చేరుకున్న పిల్లి కథ ఇది.

ఇంగ్లాడ్‌కి చెందిన టిమ్ విట్‌బ్రెడ్ ఓ పిల్లిని చాలా కాలంగా పెంచుకుంటున్నాడు. దాని పేరు జియాఫ్రె. ఓరోజు జియాఫ్రె తన యజమాని టిమ్ విట్‌బ్రెడ్ నుంచి తప్పించుకుపోయింది. దాని కోసం పదిగంటల పాటు వెదికి విసిగి వేసారిపోయిన టిమ్ చివరకు అది దొరకదనే నిర్ధారించుకున్నాడు. జియఫ్రె తప్పిపోయిన మూడు వారాల తరువాత దాని జాడ టిమ్‌కు తెలిసింది. ఈ మధ్యలో పిల్లి జాడ తెలియజేయాలంటూ టిమ్ పోస్టర్స్ వేయించాడు. చివరికి విట్‌బై ఫీల్డ్‌కు చెందిన పది సంవత్సరాల జాక్‌కు జియోఫ్రె కనిపించింది. వెంటనే ఈ విషయాన్ని జియోఫ్రె యజమానికి తెలియజేశాడు. ఈ సందర్భంగా టిమ్ మాట్లాడుతూ, జియోఫ్రె దొరికిందంటూ జాక్ టెలిఫోన్‌లో చెప్పిన విషయాన్ని నమ్మలేకపోయానని, చివరికి అక్కడికి వెళ్లి చూసిన తరువాతే నమ్మానని చెప్పాడు. సుమారు 300 కిలోమీటర్లు అది ప్రయాణించి చివరకి తనను చేరగలిగిందని టిమ్ ఆనందం వ్యక్తం చేశాడు.

కదా!'

'నీ దగ్గర నాకు దాపరికమేమిటే?' ఇందిరకి అర్థమయిపోయింది స్నేహితురాలు అడగ బోయేదేమిటో.

'పాపని చూస్తుంటే... అంటే???' అంతకన్నా ఎలా అడగాలో అర్థం కాలేదు నిర్మలకు.

ఇందిరకి దుఃఖం పొంగుకొచ్చింది.

'అంతా నా దురదృష్టం నిర్మలా! అవును నువ్వు ఊహించినట్టు... శర్వాణి మూగది. గుండెలో దాచుకోవలసిన అభం శుభం తెలియని మనవరాలిని చీటికి మాటికీ ఇష్టం వచ్చినట్టు తిడుతూంటే నా మనసుకి కష్టం కలిగి 'పెద్దవాళ్లు మీరు కూడా అలా అనడం ఏం బాగుందని' ఓ మాట అన్నానని ఈ మధ్యనే మా అత్తగారు కోపం వచ్చి మా ఆడపడుచు దగ్గరకి వెళ్లిపోయింది'

'మరి మీ ఆయన..?'

ఇందిర నిట్టూర్చింది. 'కన్నతండ్రి.... ఆయనకి దాన్ని చూస్తే ఎందుకంత ద్వేషమో అర్థం కాదే... దీని మొహం చూడాలంటేనే అసహ్యమట. పైగా మూగ మొద్దూ అని పిలవడం...'

నిర్మల విస్తుపోయింది. ఆమె కంఠంలో కోపం 'ఇందూ! మీ ఆయన్ని ఇలా అంటున్నందుకు నన్ను ఎన్నయినా తిట్టు భరిస్తాను. కాని రక్తం పంచుకు పుట్టిన బిడ్డను కించపరిచే అతను క్షమార్హుడు కాదు'

ఇందిర బాధను పంచుకోవడానికి ఇన్నాళ్లకి మనసు విప్పి మాట్లాడుకునేందుకు ఒక తోడు కనిపించగానే అది కన్నీటి రూపంలో లావాలా బయటికి పొంగుకొచ్చింది.

'మొన్నేమైందో తెలుసా? శర్వాణికి మాటలు రాకపోయినా మనసుంది కదా... ఎంత ఊహో... అందరి పిల్లలనూ చూసి దానికీ తండ్రితో ఆడుకోవాలని అనిపించింది కాబోలు. అయితే సమయా సమయాలు చిన్నపిల్లకేం తెలుస్తాయి నిర్మలా! బయట వరండాలో ఫ్రెండ్స్‌తో బాతాఖానీ వేస్తున్న తండ్రి దగ్గరకు వెళ్ళి చనువుగా ఆయన చెయ్యి పట్టుకుంది. ఆయనస్నేహితులు ఆయన లాంటి వారే... పిల్లను చూసి గుసగుసలాడుకున్నారని ఇంక చూడు ఆయన కోపం...? వాళ్లనేమీ అనలేక పాపని రెక్క పట్టుకు ఈడ్చుకెళ్ళి బెల్టుతో వాతలు తేలేలా కొట్టారు. కానీ బాధకీ ఆనందానికీ తేడా తెలియని నా చిట్టితల్లి అన్ని దెబ్బలు తిని అమాయకంగా చూస్తుంటే నాగుండె తరుక్కుపోయింది. నిర్మలా...' వెక్కిళ్లు పెడుతున్న ఇందిరను ఓదార్చడం కష్టమైంది నిర్మలకి.

'బాధపడకే ఇందూ... అనుబంధాల అల్లికలో కష్టసుఖాల మధ్య సాగేదే మానవ జీవితం.. కాలమే మీ సుధాకర్‌ను మారుస్తుంది'.

'పెళ్లయిన నాలుగేళ్లకి పుట్టిన శర్వాణి నా కలల పంటే. దానికి మాటలు రాలేదని... నేను తిరగని హాస్పిటల్ లేదు... కాని పాప పుట్టు, మూగ చెవిటి అని తేలింది. దీనికి సాయం... మాటలే రాని పాపకి 'శర్వాణి' పేరేంటని ఇరుగుపొరుగూ నా వెనక వెక్కిరింపులు.. నేను మాత్రం ఛాలెంజ్‌గా తీసుకుంటున్నానే... మాటలు రాకపోతేనేం నా బంగారు తల్లికి ఎంత గ్రహింపో తెలుసా?'

'ఈ నాలుగు రోజులుగా నేనూ గమనిస్తున్నాలే... అదిగో చూడు ఆ పిల్లలని ఎలా పలకరిస్తోందో...'

'కాని ఆ పిల్లలంతా దీన్ని వెక్కిరించినా చిరునవ్వుల్ని చిందిస్తుందే గాని కోపం రాదే నా తల్లికి...'

'బాధపడకే ఇందూ!.... పిల్లల ప్రపంచంలో నెగిటివ్ థింకింగ్ ఉండదే. ముందు ఎగతాళి చేసినా తర్వాత వాళ్లలో కలిపేసుకుంటార్లే.'

'అదీ నిజమే... నిర్మలా... నాకొక్కటే కోరికే. ఈ జన్మలో అది నన్ను అమ్మా అని పిలిస్తే చాలు...'

'పాపని ఏదన్నా దగ్గర్లోని స్కూల్లో వేయలేకపోయావా?'

'ఆ ముచ్చటా అయిందే... ఏం జరిగిందంటే... ఫీజు కోసం శర్వాణిని జాయిన్ చేసుకున్న స్కూలు ప్రిన్సిపల్ ఏడాది తిరిగాక 'ఈ పిల్లకి చదువెందుకండి? స్కూలు మాన్పించేసి హాయిగా ఇంటి పనులు, నేర్పించండి చాలు' అని సలహా ఇచ్చింది. నేనూ ఊరుకోలేదులే. 'దురదృష్టవంతులయిన మా శర్వాణిలాంటి పిల్లల విషయంలో కాస్త ఓపిక, అనురాగం మానవత్వం చూపించలేని మీకు డిగ్రీలెందుకు. మూటకట్టి అటకమీద దాచుకోండి' అనేసరికి దారికొచ్చిందనుకో. అక్కడ చదువుతున్న పిల్లలు ఇంటికెళ్లాక శర్వాణిని అనుకరిస్తూ మూగచేష్టలు చేస్తున్నారని కొంతమంది తల్లిదండ్రులు ఆవిడగారికి కంప్లయింట్ చేసారట. ఆ విషయానికీ సమాధానం గట్టిగానే చెప్పాను'.

ఇందిర మాటలు వింటున్న నిర్మలకీ ఆవేశమొచ్చింది.

'వాళ్లింట్లోనే అక్కచెల్లెళ్లుగా ఇలాంటి పిల్లలు ఉంటే వాళ్లేం చేస్తారో అడగమనాల్సింది... 'ఎదుటివాళ్లెలా పోతేనేం' అనే స్వార్థం వల్ల, మానవత్వం లేకపోవడం వల్లనే ఇలాంటి కంప్లయింట్లు... అసలు వీళ్లనీ...'

'అయినా దురదృష్టం మాది. డొనేషన్లతో నడిచే స్కూలు ప్రిన్సిపల్ అంతకంటే ఎలా ప్రవర్తిస్తుంది. పాప నిస్సహాయత నాకు అర్థమయినట్టు వాళ్లకి అర్థం కాదుగా. అందుకే పౌరుషంగా ఆ స్కూలు మానిపించేసాను. మా శర్వాణిని ఈ లోకమంతా అసూయపడేలా నేనే తీర్చిదిద్దుకుంటాను నిర్మలా...'

''ఇందిరా! నువ్వెప్పుడయినా గూడు కడుతున్న సాలెపురుగుని గమనించావా? అది ఎన్నిసార్లు పడిపోతుందని. అయినా పడుతూ లేస్తూనే పట్టుదలగా తనకంటూ చివరికి ఓ గూడుని నిర్మించుకుంటుంది. సాధిస్తుంది. ''అనుకున్నది జరిగి తీరాలన్న కోరిక మనలో బలంగా ఉంటే అందుకు అనువైన పరిస్థితులు వాటంతట అవే



సమకూరుతాయి. మనం చెయ్యాల్సిందల్లా ఒక్కటే మన మనసు మాట వినడం... ఆ సంకేతాలను అర్థం చేసుకోవడం...' అన్నారు పాలో కోయిలో.. తెలుసా? అలాగే...'

'అర్థమయిందే... నా కూతురు ఎలుగెత్తి అమ్మా అని ఏనాటికయినా నన్ను పిలవక పోతుందా అని నా ఆశ. అది తీరడం కోసం నువ్వు అన్నట్టు సాలీడులా ఎంత కష్టాన్నయినా భరిస్తాను'.

'నీది గొప్ప సంకల్పమేనే ఇందూ... అది తప్పక సిద్ధిస్తుందని నా మనసు చెబుతోంది. అన్నట్టు శర్వాణికి కాక్లియర్ ఇన్‌ప్లాంటేషన్ చేయించడానికి వీలవుతుందేమో ఇయన్‌టీ స్పెషలిస్టును సంప్రదించు. అది సక్సెస్ అయితే అతి చిన్నగా శబ్దాలు వినబడే అవకాశం అయినా మన శర్వాణికి కలగొచ్చు'.

'నాకింతవరకు ఈ ఆలోచనే రాలేదు. తప్పకుండా సంప్రదిస్తాను నిర్మలా! పాప భవిష్యత్తు కోసం ఎంత అప్పయినా చేయడానికి వెనుకాడను. ఇంతకీ శర్వాణి ఎక్కడ? కబుర్లలో పడిపోయిన మిత్రులిద్దరూ శర్వాణికోసం అటు ఇటూ చూసారు.

శర్వాణి కేలండరులోని నటరాజమూర్తి భంగిమను ప్రదర్శించేందుకు కుస్తీ పడుతోంది. అది చూసి ఇందిర నవ్వింది. ఆ నవ్వులో నిశ్చింత కనిపించింది నిర్మలకి.

'రియల్లీ షిఈజ్ బ్రిలియంట్...' అంటూ పాపను ముద్దు పెట్టుకుంది నిర్మల.

***

ఇంటిముందు పచ్చని లాన్‌లో పచార్లు చేస్తున్న నిర్మలతో సంతకం పెట్టించుకుని పెద్ద కవరు ఇచ్చి వెళ్లిపోయాడు పోస్ట్‌మేన్.

కవరు మీది వ్రాతను చూడగానే నిర్మల మొహం విచ్చుకుంది. రెండేళ్లయిపోయింది ఇందిరను శర్వాణిని చూసి.

కవరు బరువుగా ఉంది. కవరులోని నిలువెత్తు ఫొటోలో... స్టేజిమీద చక్కని నాట్య భంగిమలో శర్వాణి సాంస్కృతిక శాఖ మంత్రి గారి నుంచి బహుమతి అందుకుంటున్న దృశ్యం చూసి మతి పోయింది నిర్మలకి. పక్కనే అరమోడ్పు కన్నులతో 'అంబా' అనే బుజ్జి తువ్వాయి పిలుపుకు పరవశించిపోతున్న గోమాతలా చూస్తోంది ఇందిర.

ఎంత అద్భుతంగా ఉందో ఆ దృశ్యం? నిర్మల రెప్పవెయ్యకుండా అలాగే చూస్తోండిపోయింది చాలాసేపు.

తర్వాత కవరులోంచి ఉత్తరాన్ని బయటికి తీసింది.

'నిర్మలా!

రేపటి ఆశల చప్పుళ్లే సరిగమలుగా రాత్రివేళ... నిశ్శబ్ద సంగీతం లాంటి మా శర్వాణిని గుండెల్లో దాచుకుని ఎన్నాళ్లుగానో ఎదురుచూసిన నా నిరీక్షణ ఇన్నాళ్లకి ఫలించిందే, నోరు లేని నా బిడ్డ నన్ను 'అమ్మా' అని ఈ ప్రపంచమంతా ప్రతిధ్వనించేలా... ఎలా పిలిచిందో చూసావా? ఇది కల కాదు నిజమే...

మూగపిల్ల అన్న కారణంతో అంతా వెలివేసిన నా కూతురికి కూచిపూడి నృత్యంలో నాట్యంలో రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రథమ బహుమతి వచ్చిందే... ఈ కవరులో ఆ ఫొటోలు పంపించాను. చూసావుగా...

నా బంగారు తల్లి మంత్రిగారి చేతుల మీదుగా బహుమతి అందుకున్నదీ అంటే... ఆ కరతాళధ్వనులు... అవీ ... ఓహ్.... నేనింకా నమ్మలేక పోతున్నానే.

బహుమతి అందుకున్న వెంటనే చిన్ని... నా చిన్న... ఏం చేసిందో తెలుసా? నా చెంప మీద చిన్న ముద్దుతో ముద్ర వేస్తూంటే వేలాది కెమెరాలు క్లిక్ మంటుంటే చాలు... నా జన్మధన్యమయి పోయిందే.

అన్నట్టు నీకో విషయం చెప్పనా? నువ్వు వచ్చి వెళ్లాక ఎంతో ఆలోచించాను. ఎందుకో ప్రశాంత మైన భార్గవశర్మగారి ముఖం, ఆయన డాన్స్ స్కూలు వాతావరణం శర్వాణికి సరిపోతాయనిపించి పాపను భార్గవ శర్మగారి దగ్గర చేర్చాను. నీకు చెప్పాను కదా... ఆయన మూడేళ్ల క్రితం పార్కులో కలిసి మా శర్వాణిలోని నృత్యాభిలాషను కనిపెట్టి తొలిసారిగా మెచ్చుకున్న కళాకారుడు.... వారి సలహాతో ఇప్పుడు... మా శర్వాణి భవిష్యత్తుకోసం ఈ మధ్యనే ఢిల్లీలోని ఓ మంచి ఆర్ట్ స్కూల్లో చేర్పించాను. వారికి సదా ఋణపడి ఉంటాను.

నిర్మలా... చిత్రం!!! ఇప్పుడు అది రాత్రిళ్లు నా పక్కలో లేకపోయినా నాకు బెంగగా అనిపించడం లేదే... ఎందుకో తెలుసా?

ఇక్కడ నుంచే నా చిన్ని బంగారు భవిష్యత్తును నా మనోనేత్రంతో చూడ గలుగుతున్నాను కనుక....

ఇన్నాళ్లకి జీవితంలో నేను గెలిచాను నిర్మలా! సాలె పురుగులా పట్టు వదలకుండా సమాజం పుల్లవిరుపు మాటలు పట్టించుకోకుండా నా సంకల్పాన్ని సిద్ధింప చేసుకున్నాను కదూ.

ఈ విజయంలో నీకూ భాగముంది. ఎందుకంటే కాక్లియర్ ఇంప్లాంటేషన్‌తో నువ్వన్నట్టుగానే మా శర్వాణికి లోగొంతుకతో మాట్లాడుతున్నట్టు అన్నీ వినిపిస్తున్నాయి. అందుకే నాట్యం కూడా బాగా నేర్చుకోగలిగింది.

ఈ ఉత్తరానికి కొసమెరుపేంటో తెలుసా?

ఎప్పుడూ కన్నకూతురిని ప్రేమగా దగ్గరికి తీసుకోని దాని తండ్రి గర్వంగా ఇప్పుడు 'అది నా కూతురని' పొంగిపోతూ చెప్పుకోవడం... మా అత్తగారు శర్వాణిని ఆకాశానికెత్తేస్తూ 'ఈ కళా కారిణి నా మనవరాలని' ఊరువాడా చాటడం... నా బిడ్డ చదువుకోడానికి పనికిరాదని అర్థాంతరంగా స్కూలు నుంచి పంపేసిన స్కూలు ప్రిన్సిపల్ మళ్లీ సీటిస్తానని నా గుమ్మం ముందుకు రావడం... నా విజయానందం పంచుకునేందుకు నీకంటే నాకెవరున్నారే... నా సంకల్ప సిద్ధికి దోహదం చేసిన నీకు... ఊహూ కృతజ్ఞతలు చెప్పనులే.

ఎందుకంటే శర్వాణి నా ప్రాణంలో ప్రాణం అయితే నువ్వు నా బహిః ప్రాణానివి. ఉండనా మరి...

నీ ఇందూ...'

లోపలికి వచ్చి టివి ఆన్ చేసింది.

'మౌనంగానే ఎదగమని మొగ్గ నీకు చెబుతుంది.

ఎదిగిన కొద్దీ ఒదగమని అర్థమందులో ఉంది'

ఆ పాటలోని అంధ కళాకారుల కళ్లనుండి కారుతున్న ఆనంద భాష్పాల్లాగే నిర్మల చెంపల వెంబడి కూడా అవిరళంగా కన్నీరు ప్రవహిస్తోంది.

★

శ్రీమతి పి.వి.శేషారత్నం

***040-23399140/23303310***

